క్లుప్తంగా

పింఛన్ల పంపిణీలో మచిలీపట్నానికి ద్వితీయ స్థానం

మచిలీపట్నంటౌన్: వైఎస్సార్ సామాజిక పింఛన్ల పంపిణీలో జిల్లాలో మచిలీపట్నం నగర పాలక సంస్థ ద్వితీయ స్థానంలో నిలిచింది. నగరంలో 18,460 పింఛన్లు ఉండగా 17,291 పింఛన్లను వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు లబ్ధిదారులకు అందజేశారు. దీంతో 93.67 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయ్యింది.

దుస్తులు అందజేత

కోడూరు: గ్రామంలో కరకట్ట వెంట నివసించే ఎస్టీ కుటుంబాలకు పాలకాయతిప్ప మెరైన్ పోలీసులు శనివారం నూతన దుస్తులు అందించారు. 15 ఎస్టీ కుటుంబాల వారు కరకట్ట వెంట చిన్న గుడారాలు వేసుకొని నదిలో పీతలు పట్టుకొని వాటి విక్రయం ద్వారా వచ్చే ఆదాయంతో జీవనం సాగిస్తున్నారు. వీరి పరిస్థితిని గమనించిన మెరైన్ పోలీసులు 15 కుటుంబ సభ్యులకు నూతన దుస్తులను అందించారు.

పీహెచ్‌సీ వైద్యులకు సన్మానం

పెదకళ్లేపల్లి(మోపిదేవి): వైద్యుల దినోత్సవం సందర్భంగా పెదకళ్లేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ కె. హారిక, డాక్టర్ ఎన్. శ్రీరామ్ సాయిలను వైద్య సిబ్బంది శనివారం ఘనంగా సన్మానించారు. ఆరోగ్య కేంద్రం సిబ్బంది వీరికి శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించారు.

ఇన్‌చార్జి ఎంపీడీఓగా రామలింగేశ్వరరావు

మోపిదేవి: మోపిదేవి మండల పరిషత్ కార్యాలయం ఏఓగా, ఇన్‌చార్జి ఎంపీడీఓగా రామలింగేశ్వరరావు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా కైకలూరు మండల పరిషత్ కార్యాలయంలో ఏఓగా పనిచేస్తున్న ఆయన ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ పార్వతి మచిలీపట్నం జిల్లా పరిషత్ కార్యాలయానికి బదిలీ అయ్యారు.

శాకంబరి అలంకరణలో దుర్గమ్మ

బంటుమిల్లి: గ్రామంలోని కనకదుర్గ అమ్మవారు శనివారం శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శాకంబరి ఉత్సవాల్లో భాగంగా స్థానిక ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి సంప్రదాయంగా చీర, గాజులు, పసుపు, కుంకుమతో సారె సమర్పించి పూజలు జరిపించారు. అనంతరం మహిళలు విష్ణు, లలిత సహస్రనామ పారాయణం చేశారు.

పూరిల్లు దగ్ధం

పెడన: 18వ వార్డు ఇందిరా కాలనీలో శనివారం మధ్యాహ్నం తాటాకు ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. సీహెచ్ శ్రీనుకు చెందిన తాటాకు ఇంటి నుంచి మంటలు, దట్టమైన పొగ వస్తుండటంతో స్థానికులు గమనించి మంటలను అదుపులోకి తీసుకువచ్చినా అప్పటికే ఇంటికి నష్టం జరిగింది. చుట్టుపక్కల తాటాకు ఇళ్లకు మంటలు వ్యాపించకుండా అదుపు చేశారు. ఇంట్లోని వారంతా రోజు వారి కూలీ పనులకు పోవడంతో ప్రాణ నష్టం జరగలేదు. ఇంట్లోని వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి.

అందరికీ సంక్షేమ పథకాలే లక్ష్యం

- మంత్రి జోగి రమేష్
- జగనన్న సురక్షలో ధ్రువీకరణ పత్రాల అందజేత


చినపాండ్రాకలో మహిళకు ధ్రువీకరణ పత్రాన్ని అందిస్తున్న మంత్రి జోగి రమేష్


అశ్వరావుపాలెంలో సర్టిఫికెట్ అందిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి


తెలుగురావుపాలెంలో మాట్లాడుతున్న జేసీ అపరాజిత సింగ్

కృత్తివెన్ను: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. జగనన్న సురక్ష పథకాన్ని శనివారం మంత్రి మండల పరిధిలోని చినపాండ్రాక 1 సచివాలయం వద్ద ప్రారంభించి మాట్లాడారు. జగనన్న సురక్ష ద్వారా వలంటీర్లు ప్రతి ఇంటిని సందర్శించి ఆ కుటుంబానికి ప్రభుత్వం ద్వారా వచ్చే పథకాలకు అవసరమైన సర్టిఫికెట్‌లను గుర్తిస్తారన్నారు. తరువాత ప్రత్యేకంగా నిర్ణయించిన తేదీల్లో అదే సచివాలయం వద్ద మండలాధికారుల సమక్షంలో వారికి 11 రకాల సర్టిఫికెట్‌లను ఉచితంగా అందిస్తారని వివరించారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ఇంత చేస్తుంటే కొందరు పనికిమాలిన రాజకీయాలు చేస్తూ తమ ఉనికి చాటుకునే ప్రయత్నం చేయడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో ఎన్ని పార్టీలు, ఎందరు రాజకీయ నాయకులు కలిసి వచ్చినా జగనన్న ఒక్కడే ప్రజల కోసం ప్రజాక్షేత్రంలో నిలబడి వారిని ఎదుర్కొంటారని, అందుకు మీరంతా జగనన్నకు అండగా ఉండాలని కోరారు. ఈ సభలో 610 మందికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను మంత్రి చేతుల మీద అందజేశారు. పలువురు వలంటీర్లకు ఉత్తమ ప్రతిభా పురస్కారాలను మంత్రి అందించారు. జెడ్పీటీసీ రత్నకుమారి, ఏఎంసీ చైర్మన్ గంగాధర్, పార్టీ మండల కన్వీనర్ వెంకట్రాజు, జేసీఎస్ మండల ఇన్‌చార్జి కె. బాపూజీ, తహసీల్దార్ రామకోటేశ్వరరావు, ఎంపీడీఓ పిచ్చిబాబు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమం, సేవలు మరింత చేరువ..

ఘంటసాల(అవనిగడ్డ): ప్రజలకు సంక్షేమం, సేవలు మరింత చేరువ చేసేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని ఇన్‌చార్జి కలెక్టర్ అపరాజిత సింగ్ అన్నారు. ఘంటసాల మండలం తెలుగురావుపాలెంలో జగనన్న సురక్ష పథకాన్ని జేసీ ప్రారంభించి మాట్లాడారు. సమస్యల పరిష్కారం కోసం నాలుగు వారాల పాటు జగనన్న సురక్ష క్యాంపులను నిర్వహిస్తామని చెప్పారు. తెలుగురావుపాలెంలో మొత్తం 544 దరఖాస్తులు రాగా 533 దరఖాస్తులు అంగీకరించినట్లు తెలిపారు. కుల, ఆదాయ, నివాస, జనన, మరణ, మ్యారేజ్ సర్టిఫికెట్లతో పాటు మ్యూటేషన్ ఫర్ ట్రాన్సాక్షన్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, ఆధార్ కార్డులో మొబైల్ నెంబర్ అప్‌డేట్, కౌలు గుర్తింపు కార్డులు, కొత్త రేషన్ కార్డులు, రేషన్ కార్డు విభజన, ప్రభుత్వ డేటాకు సంబంధించి కుటుంబ సభ్యుల వివరాల్లో పేర్ల తొలగింపు వంటి 11 రకాల సేవలను ఉచితంగా అందిస్తున్నామని వివరించారు. తెలుగురావుపాలెంలో జగనన్న సురక్ష క్యాంపు ద్వారా 260 కుల ధ్రువీకరణ పత్రాలు, 221 ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, 13 సీసీఆర్‌సీ సర్టిఫికెట్లు, 39 మొబైల్‌తో ఆధార్ లింకు దరఖాస్తులకు సర్టిఫికెట్లు అందించామని చెప్పారు. ఆర్డీఓ కిశోర్, తహసీల్దార్ రాంనాయక్, తెలుగురావుపాలెం సర్పంచ్ రాచూరి ప్రసాద్‌బాబు, ఏఎంసీ చైర్మన్ వేమూరి వెంకట్రావ్, డైరెక్టర్ పి. అశోక్ కుమార్ పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

అవనిగడ్డ: ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లు ఇంటి వద్దకే అందజేసే జగనన్న సురక్ష క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. అశ్వరావుపాలెంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సింహాద్రి ప్రారంభించి మాట్లాడారు. అనంతరం పలువురికి సర్టిఫికెట్లను ఎమ్మెల్యే సింహాద్రి అందజేశారు. ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, తహసీల్దార్ రామకృష్ణ, ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలజ, ఎంఈఓ ఎన్. శివశంకరరావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రేమాలవారిపాలెంలో 790 పత్రాల జారీ..

నాగాయలంక: రేమాలవారిపాలెం, మర్రిపాలెం సచివాలయాల వద్ద శనివారం జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహించారు. రేమాలవారిపాలెంలో సర్పంచ్ చోడిశెట్టి బుజ్జిమ్మ, తహసీల్దార్ జె.విమలకుమారి, ఎస్‌ఐ ఎం.సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా 790 ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. మర్రిపాలెంలో మొత్తం 494 పత్రాలు అందజేశారు. మండలంలోని 16 గ్రామ సచివాలయాల పరిధిలో ప్రభుత్వం నిర్దేశించిన జగనన్న సురక్ష సేవల కార్యక్రమం ఈనెల 26 వరకు కొనసాగుతుంది. మర్రిపాలెంలో టీమ్–1 బృందం ఎంపీడీఓ శ్రీనివాసరావు, డీటీ నిరీష, ఎంఈఓ–2 అన్నపరెడ్డి రామారావు, రేమాలవారిపాలెంలో టీమ్–2 బృందం తహసీల్దార్ జె.విమలకుమారి, ఈఓపీఆర్డీ కె. అప్పలనరసమ్మ, ఆర్‌ఐ ఎస్. నంద గీతసారథి పర్యవేక్షణలో సేవలు అందించారు. స్థానిక ఎంపీపీ భోగాది రాఘవరాణి, జెడ్పీటీసీ సభ్యుడు మోకా బుచ్చిబాబు, పాలెం సర్పంచి అంబటి శ్యామ్‌ప్రసాద్, ఎంపీటీసీ పుట్టి స్వరూపరాణి పాల్గొన్నారు.

నాగాయితిప్పలో..

నాగాయితిప్ప(మోపిదేవి): నాగాయితిప్ప సచివాయం వద్ద సర్పంచ్‌లు గరికిపాటి వెంకటేశ్వరావు (బుల్లి), మోర్ల జ్యోత్స్న అధ్యక్షతన శనివారం జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, మండల ప్రత్యేకాధికారి ఎస్. గోవింద్ మాట్లాడారు. ఈ సందర్భంగా 237 మందికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ రామలింగేశ్వరరావు, తహసీల్దార్ కె. నవీన్‌కుమార్, ఈఓపీఆర్డీ అరుణకుమారి, ఎంపీటీసీ సనకా వెంకట రాజేష్ బాబు, పీఏసీఎస్ చైర్మన్ గరికిపాటి గోవిందరాజులు పాల్గొన్నారు.

ముంజులూరు, అర్తమూరులో 327 పత్రాల పంపిణీ

బంటుమిల్లి: మండల పరిధిలోని ముంజులూరు, అర్తమూరు గ్రామాల్లో తహసీల్దార్ సత్యనారాయణమూర్తి, ఎంపీడీఓ జె. స్వర్ణభారతి పర్యవేక్షణలో జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహించారు. 327 దరఖాస్తులు రాగా రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ చేతుల మీదుగా లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఎంపీపీ వి. చినబాబు, జెడ్పీటీసీ ఎం. వెంకట రమణ, సర్పంచ్‌లు కె. సునీత, బి. రమేష్, బి. చంద్రశేఖర్, ఎంపీటీసీ పి. వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ ఓ. చిన్నారిబాబు, ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్లు కె. గంగాధర్, పి. బాబూరావు, సచివాలయాల మండల కన్వీనరు కె. సుబ్బారావు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

సేవలను సద్వినియోగం చేసుకోవాలి

కోడూరు: మండలంలోని సాలెంపాలెం సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. డీఎఫ్‌ఓ, ప్రత్యేకాధికారి రాజశేఖర్ మాట్లాడారు. లబ్ధిదారులకు జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, ఎంపీపీ కొండవీటి వెంకట కుమారి చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రాలు అందించారు. ఎంపీడీఓ పాండురంగారావు, తహసీల్దార్ షేక్ లతీఫ్‌పాషా, ఈఓపీఆర్డీ నాగరేవతి, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అద్భుతమైన కార్యక్రమం..

చల్లపల్లి: చంద్రబాబుతీరుపై అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఆగ్రహం వ్యక్తంచేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలతో సోమరిపోతులను తయారు చేస్తున్నారని ఒకప్పుడు విమర్శలు చేసిన చంద్రబాబు ఇప్పుడు అవే పథకాలు కొనసాగిస్తానని చంద్రబాబు ఎలా ప్రచారం చేస్తున్నారని ప్రశ్నించారు. శనివారం చల్లపల్లి గ్రామ సచివాలయం–1, కొత్తమాజేరులో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఉచిత సర్టిఫికెట్లకు దరఖాస్తు చేసుకున్న వారికి ఎమ్మెల్యే రమేష్‌బాబు చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేసి మాట్లాడారు. డెప్యూటీ సీఈఓ, మండల ప్రత్యేకాధికారి గంజి శ్రీనివాసరావు, తహసీల్దార్ కె.గోపాలకృష్ణ, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు మోపిదేవి ద్వారకానాథ్, తుమ్మల వెంకటేశ్వరరావు, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిలో ఆకస్మిక తనిఖీ

చల్లపల్లి: కృష్ణా జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్ శనివారం మధ్యాహ్నం స్థానిక కస్తూరిబా మెమోరియల్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నాడు–నేడు ద్వారా ఆస్పత్రిలో చేపట్టిన సమగ్ర అభివృద్ధి, విస్తరణ, నూతన భవనాల నిర్మాణాలు, సమకూర్చిన నూతన వసతులు, రోగులకు, సిబ్బందికి సమకూరిన సౌకర్యాలను ఆమె పరిశీలించారు. ఇప్పటికే ఆస్పత్రిలో చేపట్టిన అభివృద్ధి, నిర్మాణ పనులు 90 శాతానికి పైగా పూర్తయ్యాయని చెప్పారు. త్వరలో మిగిలిన పనులు పూర్తి చేయించి ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబుచే ప్రారంభోత్సవం చేస్తామని జేసీ తెలిపారు. మచిలీపట్నం ఆర్డీఓ కిషోర్, తహసీల్దార్ కె.గోపాలకృష్ణ, వైద్యులు పాల్గొన్నారు.

ప్రజల కోసమే సంక్షేమ పథకాలు

డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ

కోనేరుసెంటర్: ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల కోసమేనని మండల ప్రత్యేకాధికారి, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ అన్నారు. బందరు మండలం రుద్రవరం, కరగ్రహారం గ్రామాల్లోని సచివాలయాల్లో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సుదీర్ఘకాలంగా పరిష్కారం కాని అనేక సమస్యలను ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వాటిని పరిశీలించిన అధికారులు అర్హులైన వారికి అక్కడికక్కడే పరిష్కార మార్గం చూపించారు. కరగ్రహారంలో 286, రుద్రవరంలో 186 అర్జీలు అందగా వాటిని పరిష్కరించారు. బందరు ఎంపీడీఓ ఎ. బాలకృష్ణరావు, బందరు తహసీల్దార్ ఎం. శ్రీవిద్య, డెప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ బందరు నియోజకవర్గ మండల కన్వీనర్ శొంఠి ఫరీద్, కరగ్రహారం మాజీ సర్పంచ్ శొంఠి కల్యాణి, రుద్రవరం ఇన్‌చార్జ్ అంగడాల ఫణికుమార్, కరగ్రహారం, రుద్రవరం పంచాయతీ కార్యదర్శులు నరసింహారావు, రాధాకృష్ణన్, ఆర్‌ఐ యాకూబ్ పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధి సాధనలో కేడీసీసీబీ ముందంజ

బ్యాంక్ పాలకవర్గ సభ్యుడు పెద వెంకయ్య

చిలకలపూడి(మచిలీపట్నం): సుస్థిరాభివృద్ధి లక్ష్య సాధనలో కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ముందంజలో ఉందని బ్యాంక్ పాలకవర్గ సభ్యుడు గడిదేశి పెదవెంకయ్య(బాలజీసు) అన్నారు. అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని పురస్కరించుకుని బ్యాంక్ ప్రధాన కార్యాలయం వద్ద సప్తవర్ణ సహకార పతాకాన్ని ఆయన ఎగురవేసి మాట్లాడారు. సుస్థిరాభివృద్ధికై సహకార సంఘాలు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. సహకార వ్యవస్థ సమున్నతమైనదని, బ్యాంకు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న అధికారులు, సిబ్బంది కృషి ప్రశంసనీయమని చెప్పారు. బ్యాంక్ జనరల్ మేనేజర్ బీఎల్ చంద్రశేఖరరావు, డీజీఎం పీజేఎస్ ప్రభాకరరావు, వరాలమ్మ, సూర్యప్రకాశరావు, జి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సర్వే రాళ్ల ఏర్పాటు

గూడూరు: జగనన్న సమగ్ర భూ రక్ష కార్యక్రమంలో భాగంగా గూడూరు మండలం గురిజేపల్లి గ్రామంలో సర్వేరాళ్లు పాతే ప్రక్రియకు శనివారం శ్రీకారం చుట్టారు. సర్వే విభాగం జిల్లా ఏడీ గోపాలకృష్ణ దగ్గర ఉండి పనులను పర్యవేక్షించారు. గూడూరు మండలంలో సర్వే పూర్తి అయిన గురిజేపల్లి గ్రామంలో రైతువారీగా కమతాలలో సర్వే రాళ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సర్వే రాళ్ల ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందిని ఏడీ ఆదేశించారు. డీఐ వర్మ, గూడూరు తహసీల్దార్ డి. విజయప్రసాద్, సర్వే విభాగం డీటీ సాయి, మండల సర్వేయర్ వెంకటేశ్వరరావు, సచివాలయ సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

అర్హుల ఇంటి వద్దకే ధ్రువీకరణ పత్రాలు


ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న పేర్ని కిట్టు


మచిలీపట్నంటౌన్: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా సచివాలయ సిబ్బంది వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను ఇంటి వద్దకే తెచ్చి ఉచితంగా అందజేస్తోందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నగరంలోని 1, 2, 3 డివిజన్లలో శనివారం నిర్వహించారు. స్థానిక 1, 2 డివిజన్లలో జరిగిన కార్యక్రమంలో పేర్ని కిట్టు పాల్గొని లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కిట్టు మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన అనంతరం నాలుగేళ్లలో దాదాపు అన్ని హామీలను నెరవేర్చారని, ఇంకా ప్రజలకు అందాల్సిన సేవలు ఏమైనా ఉన్నాయా అని ప్రతి ఇంటికి వెళ్లి సర్వే చేయించారన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలకు ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాల్సిన అవసరాలను గుర్తించి 11 రకాల ధ్రువీకరణ పత్రాలు, సేవలను ఉచితంగా అందించేందుకు ఈ కార్యక్రమం చేపట్టారన్నారు. దీనిలో భాగంగా నగరంలోని అన్ని డివిజన్లలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నామని చెప్పారు. కార్పొరేటర్లు చిరంజీవి, పరింకాయల విజయ్, వైఎస్సార్ సీపీ నగర కన్వీనర్ గూడవల్లి నాగరాజు, కమిషనర్ జి. చంద్రయ్య, ఎంఈ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో తనిఖీలు

కోనేరుసెంటర్: జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ అపరాజితసింగ్ శనివారం బందరు తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. మచిలీపట్నంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించిన ఆమె తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. సిబ్బంది పనితీరుపై ఆరా తీసి పలు సూచనలు చేశారు. విధులను సక్రమంగా నిర్వర్తించి ప్రజల మన్ననలు పొందాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ రిమార్కులు లేకుండా చూసుకోవాలని చెప్పారు. విధి నిర్వహణలో రాజీ పడాల్సిన అవసరం లేదని, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి బలవంతంగా విధులు నిర్వర్తించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

ధ్రువీకరణ పత్రాల మంజూరులో క్షుణ్ణంగా పరిశీలన చేసి అన్ని సక్రమంగా ఉన్నాయని నిర్ధారణకు వచ్చిన తరువాత మాత్రమే మంజూరు చేయాలని సూచించారు. బందరు తహసీల్దార్ శ్రీవిద్య, డెప్యూటీ తహసీల్దార్ కల్పన, ఆర్‌ఐ యాకూబ్ పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి


సురేష్‌బాబు (ఫైల్)

ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాల జెడ్పీ హైస్కూల్‌లో మ్యాథ్స్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కొల్లూరి సురేష్ బాబు (43) గుండెపోటుతో శనివారం మృతిచెందారు. ఉదయం హైస్కూల్‌కు వచ్చిన కొద్దిసేపటికే ఒక్కసారిగా చెమటలు పట్టి కుప్పకూలిపోయాడు. వెంటనే తోటి ఉపాధ్యాయులు స్థానిక పీహెచ్‌సీకి తరలించగా డాక్టర్ ఇంజక్షన్ చేసి మెరుగైన చికిత్స కోసం చల్లపల్లికి సిఫార్సు చేశారు. 108 వాహనంలో చల్లపల్లికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. గతంలో నాగాయలంక మండలం గణపేశ్వరం ఎంపీయూపీ స్కూల్‌లో పనిచేసిన సురేష్‌బాబు ఇటీవల జరిగిన బదిలీల్లో ఘంటసాల హైస్కూల్‌కు వచ్చారు. మృతుని భార్య పద్మ వక్కలగడ్డ ఎంపీయూపీ స్కూల్‌లో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. బహుజన టీచర్స్ అసోసియేషన్ కృష్ణా జిల్లా అధ్యక్షుడిగా పనిచేస్తున్న సురేష్‌బాబు అకాల మృతికి పలువురు ఉపాధ్యాయ సంఘాల నేతలు సంతాపం తెలిపారు. సురేష్‌బాబు మరణవార్త తెలుసుకున్న వెంటనే ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి మృతుని స్వగ్రామం వక్కలగడ్డకు వచ్చి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఉపాధ్యాయ సంఘ నేతలు కైతేపల్లి దాస్, దేవరపల్లి సురేష్‌బాబు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

విద్యార్థుల సంఖ్య పెరగటం శుభ పరిణామం

ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి


విద్యార్థులతో ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి

చల్లపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న ఉత్తమ విద్యా విధానంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతోందని టీచర్స్ ఎమ్మెల్సీ టి. కల్పలతారెడ్డి అన్నారు. శనివారం స్థానిక నారాయణరావు నగర్‌లోని ఎంపీపీ స్కూల్‌ను ఆమె సందర్శించారు. పాఠశాలలో గత ఏడాది విద్యార్థుల సంఖ్య 72 మంది కాగా, ఈ విద్యా సంవత్సరంలో 110 మందికి పెరగటం శుభ పరిణామం అని అన్నారు. విద్యార్థుల సంఖ్య పెరిగేందుకు కృషి చేసిన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కైతేపల్లి దాస్‌ను అభినందించారు. విద్యార్థుల సంఖ్య పెరిగిన నేపథ్యంలో వరండాలో కూడా తరగతులు నిర్వహించాల్సి వస్తోందని దాస్ తెలిపారు. విద్యార్థులు మధ్యాహ్నం భోజనం చేసేందుకు ఇబ్బందిగా ఉంటోందని, సమస్య పరిష్కారానికి డైనింగ్ హాల్ నిర్మాణానికి సహకరించాలని దాస్ విజ్ఞప్తి చేశారు. ఎంఈఓ పి.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు పి.చంద్రకుమారి, టి.విజయదుర్గ, సీహెచ్ రాధారాణి, పి.దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి సాయం

కొత్తమాజేరు(చల్లపల్లి): కొత్తమాజేరులో పీఏసీఎస్ సభ్యత్వం కలిగిన మహిళా రైతు తలుపుల రాధ ఇటీవల మృతి చెందారు. మృతురాలు రాధ కుమారుడు దినేష్‌కు సొసైటీ చైర్మన్ అరజా శివ శంకర్ శనివారం రూ. 10వేల ఆర్థికసాయం అందజేశారు. సొసైటీ సీఈఓ ఎస్ఎస్ చక్రపాణి, పర్సన్లు మోతుకూరి నాగమల్లేశ్వరరావు, పల్లె కోటేశ్వరరావు పాల్గొన్నారు.